జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక
హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 23 ॥సోమవారం ॥ 22-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-





# మూసీ పేరుతో కాంగ్రెస్ విధ్వంసం

## కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

*రాజేంద్రనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, కాంగ్రెస్, బీజేపీల వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.*

### రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

### కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామన్న కేటీఆర్

**రాజేంద్రనగర్, జూన్ 21 :**
మూసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసకర రాజకీయాలు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గాంధీ పేరును ప్రస్తావిస్తూ పేదల ఇళ్లను కూల్చ డం సరైన చర్య కాదన్నారు. గాంధీపై నిజమైన గౌరవం ఉంటే పేదలకు న్యాయం చేయాలని, వారి నివాసాలను (మిగతా 2వ పేజీలో)



# హుస్నాబాద్‌లో ఘనంగా యోగా దినోత్సవం

### ఆరోగ్య హుస్నాబాద్ - ఆరోగ్య భారత్ లక్ష్యం

### మంత్రి పొన్నం ప్రభాకర్

### ఎల్లమ్మ చెరువు కట్టపై యోగాసనాలు వేసిన మంత్రి

### ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపు

**హుస్నాబాద్, జూన్ 21**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలో ని ఎల్లమ్మ చెరువు కట్టపై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా యోగాసనాలు వేసి ప్రజలకు యోగ ప్రాముఖ్యతను వివరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, ఆరోగ్యవంతమైన జీవనానికి యోగ ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ముఖ్యంగా సూర్య నమస్కారాలు (మిగతా 2వ పేజీలో)






# భారత నౌకాదళంలో మూడు కొత్త యుద్ధ నౌకలు

*భారత నౌకాదళ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా ఐఎన్ఎస్ దునాగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధాని నరేంద్ర మోదీ కోల్‌కతాలో అధికారికంగా జాతికి అంకితం చేశారు.*

### సముద్ర భద్రతలో మరో కీలక అడుగు

### ఆత్మనిర్భర్ భారత్‌కు నిదర్శనమన్న మోదీ

### కోల్‌కతాలో ప్రారంభించిన ప్రధాని మోదీ

**కోల్‌కతా, జూన్ 21**
ఈ సందర్భంగా దేశ రక్షణ రంగంలో స్వావలంబన సాధనకు భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. (మిగతా 2వ పేజీలో)





# యోగా చైతన్యానికి కొత్త ఊపు

**విజయవాడ, జూన్ 21**
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత శక్తివంత మైన సాధనమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన భారీ యోగా కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ (మిగతా 2వ పేజీలో)



# ప్రతి ఒక్కరి జీవితంలో యోగ ఉండాలి

## ప్రధాని నరేంద్ర మోదీ

### కోల్‌కతాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

### రెడ్ రోడ్‌పై వేలాదిమందితో యోగాభ్యాసం

### ఆరోగ్యవంతమైన వృద్ధాప్యమే ఈ ఏడాది ప్రధానాంశం

**కోల్‌కతా, జూన్ 21**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్ కతాలో నిర్వహించిన భారీ యోగ కార్యక్రమం విశేషం గా ఆకట్టుకుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నగరంలోని రెడ్ రోడ్‌పై నిర్వహించిన ఈ కార్యక్రమం లో సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగకు స్థానం (మిగతా 2వ పేజీలో)

# ఆర్టీసీ బస్సులో అగ్ని ప్రమాదం

### ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

### సాంకేతిక లోపంతో చెలరేగిన మంటలు

### సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



# నేటి రాశి ఫలాలు

**మేషం :** పట్టుదలతో పనిచేసి అనుకున్నది సాధిస్తారు. కొన్ని పరిస్థితులు మనోవిచారాన్ని కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. హనుమాన్ చాలీసా పఠిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి.

**వృషభం :** కీలక విషయాల్లో దిగ్విజయంగా ముందుకెళ్తారు. వృత్తి, వ్యాపార రంగాల్లో మీకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు మారతాయి. ఆనందించే సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఇష్టదైవ స్తుతి మంచిది.

**మిథునం :** ఉద్యోగంలో కార్యసిద్ధి ఉంది. స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల మాటలకు గౌరవం ఇస్తూ ముందుకెళ్లండి. శుభం జరుగుతుంది. ఆంజనేయ స్వామి సందర్శనం శుభప్రదం.

**కర్కాటకం :** చేపట్టే పనులకు ఆటంకం కలగకుండా చూసుకోవాలి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. కొన్ని సంఘటనల్లో ఆటంకాలు ఎదురైనా అధైర్యపడకుండా ముందుకు సాగితే మేలైన ఫలితాలు లభిస్తాయి. దుర్గాస్తుతి శుభదాయకం.

**సింహం :** చేపట్టిన పనులలో పురోగతి ఉంటుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. సంతృప్తికర ఫలితాలను రాబట్టడానికి ఇది సరైన సమయం. సౌభాగ్య సిద్ధి ఉంది. ఇష్టదేవత స్తోత్ర పఠనం శుభప్రదం.

**కన్య :** మీ మీ రంగాల్లో కార్యజయం ఉంది. కీర్తి వృద్ధి చెందుతుంది. బంధువుల ఆదరాభిమానాలుంటాయి. అర్థలాభం ఉంది. ఆంజనేయ స్వామి ఆరాధన శుభదాయకం.

**తుల :** తలపెట్టిన కార్యాల్లో విజయసిద్ధి ఉంది. ఒక శుభవార్త ఉత్సాహాన్నిస్తుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. తోటివారి సహాయ సహకారాలున్నాయి. దైవబలం రక్షిస్తోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి సందర్శనం శుభప్రదం.

**వృశ్చికం :** మీ మీ రంగాల్లో సందర్భానుసారంగా ముందుకు సాగితే శుభఫలితాలు అందుకుంటారు. మీ పట్టుదలే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. అనవసర విషయాల్లో తలదూర్చకండి. లక్ష్మీ ధ్యానం మంచినిస్తుంది.

**ధనుస్సు :** శ్రమకు తగిన ఫలితాలుంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారులతో నమ్రతగా వ్యవహరించాలి. గిట్టనివారు మీ ఉత్సాహంపై నీళ్లు చల్లుతారు. మనోవిచారం కలిగించే ఘటనలకు దూరంగా ఉండాలి. సూర్య స్తుతి మేలుచేస్తుంది.

**మకరం :** ప్రశాంతమైన ఆలోచనలతో గొప్పవారవుతారు. సమర్థతను పెంచాలి. కీలక విషయాల్లో బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి. శుభఫలితాలు పొందడానికి వేంకటేశ్వర స్వామిని సందర్శించాలి.

**కుంభం :** లక్ష్యాలకు కట్టుబడి పనిచేయాలి. ధర్మ సందేహాలతో కాలాన్ని వృథా చేయకండి. కుటుంబ సభ్యులతో ఆచితూచి వ్యవహరించాలి. మనోవిచారం కలగకుండా చూసుకోవాలి. ప్రయాణంలో ఆటంకాలు కలుగుతాయి. శివారాధన శుభప్రదం.

**మీనం :** చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. కొన్ని సందర్భాల్లో లౌక్యంగా వ్యవహరించి సమస్యలను అధిగమిస్తారు. భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగండి. గణపతి ఆరాధన శుభప్రదం.



# మూసీ పేరుతో కాంగ్రెస్ విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)


కాపాడాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పేదల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. స్థానిక బీజేపీ నేతలు ఒకలా మాట్లాడుతున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు నిధులు లేవని చెబుతూనే మూసీ ప్రాజెక్టు కోసం భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేయడానికి సిద్ధమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాలపై కూడా



కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన నాయకులు పార్టీ మారినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోయినప్పటికీ బీఆర్ఎస్ బలహీనపడలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. గులాబీ సైన్యం రాష్ట్రవ్యాప్తంగా బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో అగ్నిప్రమాదం

**కరీంనగర్, జూన్ 21 :** కరీంనగర్-2 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న సమయంలో తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ సమీపంలో ఈ ఘటన జరిగింది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బస్సులో సాంకేతిక లోపం ఏర్పడటంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక భాగం నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపివేశారు. పరిస్థితిని అంచనా వేసిన సిబ్బంది ప్రయాణికులను అప్రమత్తం చేశారు. డ్రైవర్, కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ వెంటనే కిందికి దించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు, ప్రయాణికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అనంతరం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన కారణంగా కొంతసేపు ఆ మార్గం లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని చక్కదిద్దారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు వివరాలను సేకరించారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాల పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఎలక్ట్రిక్ బస్సులోని బ్యాటరీ వ్యవస్థలో లోపమా లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశంగా నిలిచింది.



## యోగా చైతన్యానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేశ్, ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి పాల్గొన్నారు. వేలాది మంది యోగా సాధకుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక, ఆరోగ్య చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో మాట్లాడిన చంద్రబాబు, యోగాకు ప్రపంచవ్యాప్తంగా అపూర్వ గుర్తింపు రావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి ఎంతో గొప్పదని అన్నారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ప్రపంచ వేదికపై నిలబెట్టి, దాదాపు 190 దేశాలు యోగా దినోత్సవాన్ని జరుపుకునేలా చేసినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధ్యాత్మికత, సాంకేతికత రెండూ కలిసినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం ద్వారా మనిషి శారీరకంగా దృఢంగా, మానసికంగా ప్రశాంతంగా ఉండగలడని చెప్పారు. ఆరోగ్యవంతమైన, సంపన్నమైన, ఆనందభరితమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత ఏడాది విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని గుర్తుచేసిన సీఎం, వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను తిరుపతిలో మరింత వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. యోగాను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాల్లో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో యోగా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. జిల్లా, మండల స్థాయిల్లో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించే అధికారులను నియమిస్తామని, యోగా ప్రమాణాలను రూపొందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. 'యోగాంధ్ర' పేరుతో ప్రత్యేక డిజిటల్ వేదికను ప్రారంభించి యోగా సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ, వార్డు స్థాయి కార్యాలయాల్లో శాశ్వత యోగా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి సహజ ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఆగస్టు 15న 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని

## భారత నౌకాదళంలో మూడు కొత్తయుద్ధ నౌకలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నౌకలు భారత సముద్ర భద్రతను మరింత పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని తెలిపారు. దేశ సముద్ర సరిహద్దుల రక్షణ, వ్యూహాత్మక అవసరాల నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ సామర్థ్యాల పెంపులో ఇవి ఉపయోగపడనున్నాయని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, దేశీయ రక్షణ తయారీ రంగ సామర్థ్యాలతో ఈ నౌకలు రూపొందించబడటం విశేషమని మోదీ పేర్కొన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు.

భారత నౌకాదళం ఆధునికీకరణలో భాగంగా కొత్త సాంకేతికతతో రూపొందించిన యుద్ధ నౌకలు, సర్వే నౌకలు, సహాయక నౌకలను దశలవారీగా సేవల్లోకి తీసుకువస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలపడనుంది. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో సముద్ర భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో ఈ నౌకల చేరిక కీలకమని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సముద్ర మార్గాల్లో జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇవి తోడ్పడనున్నాయి.

భారత నౌకాదళం శక్తివంతంగా మారడం ద్వారా దేశ భద్రతతో పాటు స్వదేశీ రక్షణ పరిశ్రమకు కూడా కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశీయ తయారీ సామర్థ్యాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడుతున్నాయని ఆయన వెల్లడించారు.

## ప్రతి ఒక్కరి జీవితంలో యోగ ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలనే ముఖ్యమైన సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించామని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మంది ఒకే వేదికపై యోగాసనాలు సాధించారు. విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని యోగ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. కోల్‌కతా నగరం యోగ చైతన్యంతో కళకళలాడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది యోగా దినోత్సవానికి "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగ" అనే ప్రధాన అంశాన్ని ఎంచుకున్నట్లు మోదీ పేర్కొన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చనే సందేశాన్ని ప్రపంచానికి అందించడమే దీని ఉద్దేశమని తెలిపారు. యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మనసు, శరీరం, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే జీవన విధానమని ప్రధాని పేర్కొన్నారు.



నిత్య జీవితంలో యోగను భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవచ్చని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యోగకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని మోదీ అన్నారు. యోగ ద్వారా ప్రపంచ దేశాలు ఆరోగ్యకర జీవన విధానాన్ని స్వీకరిస్తుండటం సంతోషకర పరిణామమని పేర్కొన్నారు. భారతదేశం అందించిన ఈ ప్రాచీన సంపద నేడు మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో లక్షలాది మంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని మరో సారి ఈ వేడుకలు నిరూపించాయని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.

## హుస్నాబాద్‌లో ఘనంగా యోగా దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

శరీరాన్ని దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా యోగ అందిస్తుందని వివరించారు. ప్రజల్లో యోగపై అవగాహన పెంచేందుకు పట్టణ కేంద్రంలో సూర్య నమస్కారాల వివిధ భంగిమలను ప్రతిబింబించే శిల్పాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. యోగను ప్రజల జీవితాలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి వ్యక్తి తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. "ఆరోగ్య హుస్నాబాద్ - ఆరోగ్య భారత్" లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. యోగ సాధనకు వయసుతో సంబంధం లేదని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ యోగ చేయవచ్చని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగ శిక్షకులు, విద్యార్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్వేత

## సంపాదకీయం

ఆదివారం 21-6-2026

# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా!

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది.

దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి.

అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.




# పాతికేళ్ల 'బసవతారకం'

**క్యాన్సర్ బాధితుల పాలిట ఆశాకిరణం**

**ఆస్పత్రి నిర్వహణ పవిత్ర యజ్ఞంగా భావిస్తున్న నందమూరి బాలకృష్ణ**

**100 పడకలతో మొదలై 650 పడకల క్యాన్సర్ కేంద్రంగా ఎదిగిన వైనం**

**ఏటా 3 లక్షల మందికి పైగా ఓపీ సేవలు**

**స్క్రీనింగ్ బస్సుల ద్వారా పల్లెలు, తండాల్లో ఉచిత వైద్య శిబిరాలు**

**నేడు బసవతారం ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు**

**హాజరుకానున్న ఏపీ సీఎం చంద్రబాబు, వైద్య నిపుణులు, దాతలు**

హైదరాబాద్, జూన్ 21: ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారి బారినపడిన నిరుపేదలకు ఆ ఆస్పత్రి ఒక సంజీవని. లక్షలు ఖర్చయ్యే ఖరీదైన కార్పొరేట్ వైద్యం తమకు అందదనే ఆవేదనతో ఉన్న సామాన్యుల పాలిట అది అతిపెద్ద ఆశాకిరణం. లాభాపేక్ష లేకుండా దశాబ్దాలుగా నిరంతర సేవలందిస్తున్న ఆ మానవతా మందిరమే బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్. దివంగత నందమూరి తారక రామారావు ఆశయంతో మొదలైన ఈ ఆస్పత్రి విజయవంతంగా 25 ఏళ్ల సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని సగర్వంగా రజతోత్సవాలను జరుపుకుంటోంది.

**ఎన్టీఆర్ సంకల్పం.. వాజ్‌పేయి చేతుల మీదుగా**

క్యాన్సర్ వ్యాధితో ఏ ఒక్కరి జీవితం అర్ధాంతరంగా ముగిసిపోకూడదన్న ఎన్టీఆర్ సతీమణి బసవతారకం చివరి కోరిక మేరకు నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో 1988లో ఈ ఆస్పత్రికి బీజం పడింది. వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రవాస భారతీయులు, దాతల విశేష సహకారంతో 2000 సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి చేతుల మీదుగా 100 పడకలతో ఈ ఆస్పత్రి ప్రారంభమైంది. నేడు సేవల విస్తరణలో భాగంగా ఏకంగా 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే అత్యుత్తమ సమగ్ర క్యాన్సర్ చికిత్స, పరిశోధనా కేంద్రంగా అవతరించింది.

**పేదల పాలిట వరం**

ఆర్థిక స్తోమత లేని ఎందరో ప్రాణాలను బసవతారకం ఆస్పత్రి నిలబెడుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది ఇక్కడికి వస్తుంటారు. విశేషమేమిటంటే క్యాన్సర్ చికిత్స కోసం ఈ ఆస్పత్రిని ఆశ్రయించే వారిలో 65 శాతం మందికి పైగా నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా వీరికి ఉచితంగా ప్రపంచస్థాయి వైద్యాన్ని అందిస్తున్నారు. ఆసుపత్రిలో క్యాన్సర్‌ను వేగంగా, కచ్చితంగా గుర్తించేందుకు అత్యాధునిక డిజిటల్ పాథాలజీ ల్యాబ్‌లను కూడా ప్రారంభించారు. ఏటా సుమారు 3 లక్షల మందికి పైగా అవుట్ పేషెంట్లు, 90వేల మంది ఇన్ పేషెంట్లకు ఈ ఆస్పత్రి అండగా నిలుస్తోంది. ఇప్పటివరకు 8 వేలకు పైగా క్లిష్టమైన క్యాన్సర్ శస్త్రచికిత్సలు, 86 బోన్ మ్యారో మార్పిడి ఆపరేషన్లను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాలతో పాటు రేడియాలజీ, పాథాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పరిశోధన విభాగాల్లో సుమారు 250 మంది వైద్యులు, వైద్య సిబ్బంది ఇక్కడ చికిత్స కోసం వచ్చే రోగులకు విశేష సేవలందిస్తున్నారు.

**గ్రామాల దాకా మొబైల్ సేవలు**

కేవలం ఆస్పత్రి నాలుగు గోడలకే పరిమితం కాకుండా రోగుల వద్దకే బసవతారకం సేవలు వెళ్తున్నాయి. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రాణాలు కాపాడేందుకు ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేకంగా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్ ఏర్పాటు చేసింది. డిజిటల్ మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే వంటి సదుపాయాలున్న ఈ బస్సు ద్వారా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే, నొప్పి నివారణ కోసం ప్రత్యేక పాలియేటివ్ కేర్ యూనిట్ ద్వారా రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యాన్ని నింపుతున్నారు.

**బాలయ్య పవిత్ర యజ్ఞం.. సోమవారం వేడుకలు**

తల్లిదండ్రుల ఆశయాన్ని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఒక పవిత్ర యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తున్నారు. బసవతారకం ఆస్పత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన పేదలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా నిరంతరం శ్రమిస్తున్నారు. ముఖ్యంగా విదేశాల్లోని తెలుగు సంఘాలు ప్రవాస భారతీయుల సహకారంతో ఆయన ఎన్నో ఏళ్లుగా విరాళాలు సేకరిస్తూ, హైదరాబాద్‌లోని ఆసుపత్రి విస్తరణకు, పేద రోగులకు ఉచిత వైద్యం అందించడానికి కృషి చేస్తున్నారు. ఆస్పత్రి సేవలను ఆంధ్రప్రదేశ్ లోనూ అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో ఇటీవలే అమరావతిలోని తుళ్లూరు పరిధిలో రూ.750 కోట్ల వ్యయంతో, 21 ఎకరాల విస్తీర్ణంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులకు బాలకృష్ణ శంకుస్థాపన చేశారు. మొదటి దశలో 500 పడకలతో ఈ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది.

మానవత్వం, సేవాభావంతో పాతికేళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా ఇవాళ సాయంత్రం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో బసవతారకం ఆస్పత్రి రజతోత్సవాలను అట్టహాసంగా నిర్వహించనున్నారు. బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక వేడుకలకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరుకానున్నారు.



# వీబీజీ రామ్ జీ పై ఉమ్మడి పోరు!

**ఉపాధి హామీకి గాంధీ పేరు తొలగింపుపై అభ్యంతరం**

**విపక్ష రాష్ట్రాలతో కలిసి తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటం**

**మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం**

హైదరాబాద్, జూన్ 21: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రామ్ జీ చట్టం-2025పై న్యాయపోరాటానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ చట్టం వల్ల రాష్ట్రాలపై పడే ఆర్థిక భారం, ఉపాధి హామీ పథకంపై చూపే ప్రభావంపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి తదితరులు వర్చువల్ గా పాల్గొన్నారు. రాష్ట్రాల హక్కులు, గ్రామీణ ఉపాధి పరిరక్షణే ధ్యేయంగా కేంద్రం నిర్ణయాన్ని రాజ్యాంగపరంగా సవాల్ చేయాలని ఈ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది.అలాగే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం పట్ల కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఈ చారిత్రాత్మక పథకానికి గాంధీజీ పేరును యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేసింది.ఈ చట్టానికి వ్యతిరేకంగా ఒంటరిగా కాకుండా ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరు చేయాలని సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది.

# ఒకవైపు చర్చలు... మరోవైపు హెచ్చరికలు


గ్లోబల్ డెస్క్, జూన్ 21: అమెరికా, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు మరియు యుద్ధ వాతావరణానికి శాశ్వత ముగింపు పలికేలా స్విట్జర్లాండ్ వేదికగా ఎట్టకేలకు ఉన్నత స్థాయి శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరపున పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ నేతృత్వంలోని బృందాలు పాల్గొనగా.. పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. చర్చల ప్రారంభానికి ముందు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపు పలకడం వంటి అంశాలు ఇప్పటికే పూర్తయ్యాయని, పశ్చిమాసియాలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించి ఇరుదేశాల సంబంధాలను శాశ్వతంగా మార్చడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరుదేశాల మధ్య ఇంతటి ఉన్నత స్థాయి సమావేశం జరగడం చరిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. మరోవైపు, ఈ చర్చలు ప్రారంభమైన తరుణంలోనే ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లెబనాన్‌లో సమస్యలు సృష్టించకుండా అక్కడి తమ 'ప్రాక్సీ' (హెజ్‌బొల్లా)లను ఇరాన్ వెంటనే నిలువరించాలని, లేనిపక్షంలో ఇరాన్‌పై మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడతా మని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా హెచ్చరించారు. నిజానికి ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య ఘర్షణలు తీవ్రతరం కావడం వల్ల రెండు రోజుల క్రితమే ప్రారంభం కావాల్సిన ఈ చర్చలు వాయిదా పడ్డాయి.



## 20లో చేసిన నిర్లక్ష్యం.. 40లో
# ఆరోగ్య సమస్యలు!

**డెస్క్ జూన్ 21 :**

యువకుల్లో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం సాధారణంగా కనిపించే అంశంగా మారుతోంది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవు కాబట్టి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం లేదనే భావన చాలామందిలో కనిపిస్తోంది. అయితే ఇరవై ఏళ్ల వయస్సులో అలవాటు చేసుకున్న కొన్ని చెడు జీవనశైలి విధానాలు నలభై ఏళ్ల వయస్సుకు చేరుకునే సరికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీర ఆరోగ్యానికి జీర్ణవ్యవస్థ పునాదిలాంటిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనం తీసుకునే ఆహారం సక్రమంగా జీర్ణమై శరీరానికి అవసరమైన పోషకాలు అందాలంటే పేగుల ఆరోగ్యం బాగుండాలి. శక్తి స్థాయిలు, మానసిక ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, చర్మ కాంతి, ఏకాగ్రత వంటి అనేక అంశాలు జీర్ణవ్యవస్థ పనితీరుతో ముడిపడి ఉంటాయి. అందుకే చిన్న వయస్సు నుంచే పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరం. నిద్ర విషయంలో యువత ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం, మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో సమయం గడపడం వల్ల నిద్ర సమయం తగ్గిపోతోంది. కోల్పోయిన నిద్రను తరువాత పూడ్చుకోవచ్చని చాలామంది భావిస్తుంటారు. అయితే శరీరానికి అవసరమైన నిద్రను నిరంతరం కోల్పోవడం వల్ల జీవక్రియలపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.



## కంట్లో పూత.. నిర్లక్ష్యం చేస్తే
# చూపుకే ముప్పు!

**డెస్క్, జూన్ 21 :**

కంట్లో పూత అనేది సాధారణంగా కనిపించే సమస్య అయినప్పటికీ నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైరస్‌లు, బ్యాక్టీరియా, అలెర్జీలు లేదా పరిశుభ్రత లోపం కారణంగా ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో కంటి ఇన్‌ఫెక్షన్లు వేగంగా వ్యాపించే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కంట్లో పూత వచ్చినప్పుడు కళ్లు ఎర్రబడటం, దురద, మంట, నీరు కారడం, ఉదయం నిద్రలేచినప్పుడు కనురెప్పలు అతుక్కుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందిలో కంటి చుట్టూ వాపు, వెలుతురును చూడలేకపోవడం, మసకగా కనిపించడం వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు. ఈ లక్షణాలను సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు. కంటి పూత ఎక్కువగా ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపిస్తుంది. బాధితులు ఉపయోగించినతువ్వాళ్లు, రుమాళ్లు, దిండ్లు లేదా ఇతర వస్తువులను ఉపయోగించడం వల్ల ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంటుంది. అందువల్ల కంటి పూత ఉన్న వ్యక్తులు వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకూడదు. కళ్లను తరచూ చేతులతో రుద్దడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. చేతుల ద్వారా సూక్ష్మక్రిములు కంట్లోకి చేరి ఇన్‌ఫెక్షన్ పెరిగే ప్రమాదం ఉంటుంది. అందుకే చేతులను శుభ్రంగా కడుక్కోవడం, కళ్లను తాకకుండా ఉండడం అవసరం. చాలామంది వైద్యుల సలహా లేకుండా మందుల దుకాణాల్లో దొరికే చుక్కల మందులను ఉపయోగిస్తుంటారు. ఇది ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంటి సమస్యకు అసలు కారణం ఏమిటో తెలుసుకుని తగిన చికిత్స తీసుకోవడం అవసరం. తప్పు మందులు వాడటం వల్ల సమస్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కంటి పూత నివారణలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుంది. కళ్లను శుభ్రమైన నీటితో కడుక్కోవడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, దుమ్ము, కాలుష్యానికి దూరంగా ఉండడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కాంటాక్ట్ లెన్స్‌లు వాడేవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. పిల్లల్లో కంటి పూత సమస్య ఎక్కువగా కనిపిస్తుంది.

# యోగా దినోత్సవం సందర్భంగా బాలసదన్‌లో యోగా కార్యక్రమం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సంగారెడ్డి బాలసదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య హాజరై యోగా ప్రాముఖ్యతపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవచ్చని, ఒత్తిడిని తగ్గించుకుని శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం బాలసదన్‌లోని పిల్లల సంక్షేమంపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించారు. బాలసదన్‌లో ఉన్న పిల్లల పూర్తి బాధ్యత అధికారులదేనని పేర్కొంటూ, వారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు, భద్రత కల్పించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు రుచిక రమైన, పౌష్టికా హారం అందిం చడంతో పాటు వారిని సొంత పిల్లలుగా భావించి ప్రేమాభి మానాలతో చూసు కోవాలని సూచించారు. న్యాయ పరమై న సమస్యలు ఎదు ర్కొంటున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ జిల్లా న్యాయ సేవాధి, కార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అవసరమైన వారు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో బాలసదన్ విద్యార్థులు,



సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ సుకుమార్, సీడీపీఓ రత్నం, బాలసదన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ఏజెంట్లతో మంత్రి అవగాహన సమావేశం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 21**



ఆందోల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై ఆందోల్, వట్పల్లి, పుల్కల్, చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ లతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్న మంత్రి గారు, ప్రతి ఓటరులో తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రతి ఏజెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, దాని ముఖ్య ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.


# నీట్-యూజీ 2026 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 21**



నీట్-యూజీ 2026 పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి; కేంద్రీయ విద్యాలయం (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి (బాలుర); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి (బాలికల); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి; ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల; ప్రభుత్వ మహిళల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను తెరవడానికి అనుమతి లేదని తెలిపారు. అలాగే సెక్షన్-163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్-144 సీఆర్పీసీ) అమల్లో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగడం నిషేధమని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ఎలాంటి కమ్యూనికేషన్ సిగ్నల్స్ అందకుండా జామర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. తప్పుడు వార్తలు, వదంతులు (రూమర్స్) ప్రచారం చేసి పరీక్షల ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు కార్యాలయం ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే తప్పుడు వార్తలు, నిర్ధారణ లేని ఫార్వర్డ్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు సందేశాలను వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల
# విస్తరణపై లోకేశ్ చర్చలు



**కోల్‌కతా, జూన్ 21 :**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కోల్‌కతాలో సెంచరీ ప్లైబోర్డ్స్ సంస్థ యాజమాన్యంతో సమావేశమయ్యారు. సంస్థ వ్యవస్థాపకులు సజ్జన్ భజాంకా, కేశవ్ భజాంకా, నికితా బన్సాల్‌తో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సంస్థ పెట్టుబడులను మరింత పెంచడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించే అవకాశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం సంస్థ ద్వారా లభిస్తున్న ఉపాధి అవకాశాలను మరింత పెంచే అంశంపై కూడా సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం సుమారు 2,500 మందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థ, భవిష్యత్తులో 5,000 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టే అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, స్థానిక పారిశ్రామిక శిక్షణ సంస్థలను దత్తత తీసుకుని యువతకు శిక్షణ అందించే అంశాలను పరిశీలించారు. రాష్ట్ర యువతకు ఉద్యోగావకాశాలు పెంచడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని లోకేశ్ తెలిపారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు.

# మాజీ డీసీఎంఎస్ చైర్మన్ తండ్రి ఈశ్వరయ్యకు నివాళులు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 21**

మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తండ్రి మల్కాపురం ఈశ్వరయ్య ఇటీవల పరమపదించిన నేపథ్యంలో, జహీరాబాద్‌లోని వారి నివాసానికి మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదివారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తీవ్ర విషాదంలో ఉన్న శివకుమార్‌ను ఓదార్చి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈశ్వరయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈశ్వరయ్యకు నివాళులర్పించారు.



# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**మచిలీపట్నం, జూన్ 21 :**

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం 8వ డివిజన్ చిలకలపూడికి చెందిన బొర్రా వెంకటేశ్వరరావు కుమార్తె బొర్రా యుక్త తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమె వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.6 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన కొల్లు రవీంద్ర, ప్రజల ఆరోగ్య అవసరాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారుతోందని పేర్కొన్నారు. అదే కార్యక్రమంలో తారక భాస్కర్‌రావుకు మంజూరైన రూ.68 వేల ఆర్థిక సహాయ చెక్కును కూడా మంత్రి అందజేశారు. అవసరంలో ఉన్న ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రజలు అర్హత ఉన్న పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని మంత్రి వెల్లడించారు. అత్యవసర వైద్య చికిత్సలు, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కొల్లు రవీంద్ర, భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# యోగాంధ్రతో ఆరోగ్య చైతన్యం: అనిత

**విశాఖపట్నం, జూన్ 21 :**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం బీచ్ రోడ్డులోని సాగరిక ఫంక్షన్ హాలులో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె యోగాసనాలు సాధించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో పాటు పలువురు అధికారులు, యోగా సంఘాల ప్రతినిధులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అనిత ప్రతి వ్యక్తి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలంటే యోగాను రోజువారీ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా ద్వారా వాటిని అధిగమించే అవకాశం ఉందన్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే శరీర దృఢత్వం, ఏకాగ్రత, మానసిక స్థైర్యం పెరుగుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'యోగాంధ్ర' కార్యక్రమాల ద్వారా యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతోందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు యోగా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న అనిత, ప్రతి కుటుంబం యోగాను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అన్నారు.



# టీడీపీకి షాక్.. వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు

**ఆలూరు, జూన్ 21 :**

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. హోళగుంద మండలం సులువాయి గ్రామానికి చెందిన ఈ కుటుంబాలు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడిన బుసినే విరూపాక్షి, రాష్ట్రంలో ప్రజలు ప్రస్తుత ప్రభుత్వ పాలనపై అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని విరూపాక్షి పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడం, ప్రకృతి వైపరీత్యాల సాయం, ఇన్‌పుట్ సబ్సిడీలు, వడ్డీ రహిత రుణాల విషయంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించలేదని ఆరోపించారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. విద్యా, సంక్షేమ రంగాల్లో కూడా ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆయన విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన పలు హామీలు ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ప్రతిపక్షం పోరాటాలు చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళన కరంగా మారిందని విరూపాక్షి వ్యాఖ్యానించారు. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడంలో విఫల మైందని అన్నారు. ప్రజల్లో భద్రతాభావం తగ్గిపోతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మరింత మంది వైఎస్సార్‌సీపీ వైపు వస్తున్నారని విరూపాక్షి అన్నారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**అనంతపురం, జూన్ 21 :**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని మంత్రి స్వయంగా పరిశీలిస్తూ బాధితుల సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడారు. వినతులపై వెంటనే స్పందించిన మంత్రి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన పయ్యావుల కేశవ్, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పరిపాలన సాగుతుందని పేర్కొన్నారు.




# మోదీ పాలన విజయాలను వివరించిన పురందేశ్వరి

**రాజమహేంద్రవరం, జూన్ 21 :**

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ), జీఐఈటీ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజుతో పాటు యాజమాన్య బోర్డు డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బందిని కలిసి కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి పురందేశ్వరి వివరించారు. పేదల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, మహిళా సాధికారత, యువతకు అవకాశాల విస్తరణ వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. దేశ రక్షణ రంగంలో సాధించిన పురోగతి, స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెరగడం వంటి అంశాలపై కూడా ఆమె చర్చించారు. ప్రపంచ ఆర్థిక సవాళ్ల మధ్య కూడా భారతదేశం స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనకు విద్య, సాంకేతికత, పారిశ్రామిక రంగాల అభివృద్ధి కీలకమని పురందేశ్వరి అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, డిజిటల్ సేవల విస్తరణ ద్వారా దేశం వేగంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు మోదీ నాయకత్వంలో దేశం పలు రంగాల్లో సాధిస్తున్న పురోగతిని ప్రస్తావించినట్లు పురందేశ్వరి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల రంగాల్లో జరిగిన మార్పులు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయని అభిప్రాయాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని పురందేశ్వరి అన్నారు. యువతలో జాతీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయ ప్రతినిధులు, అధ్యాపకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# నాన్నే జీవితానికి తొలి ఆదర్శం: అనిత

**అమరావతి, జూన్ 21 :**

ఫాదర్స్ డే సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తండ్రి గొప్పతనాన్ని గుర్తుచేసుకుంటూ హృదయపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. మన కలలకు రెక్కలు తొడగడం కోసం తన జీవితాన్ని అంకితం చేసే వ్యక్తి తండ్రి అని పేర్కొంటూ ఆయన పాత్రను కొనియాడారు. తన రెక్కల కష్టాన్ని ధారపోసి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే నిఖార్సైన వ్యక్తిత్వం తండ్రిదేనని అనిత అన్నారు. కుటుంబం కోసం ఎన్నో కష్టాలను భరిస్తూ, పిల్లల విజయాల కోసం నిరంతరం శ్రమించే ప్రతి తండ్రికి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అపజయాల సమయంలో ధైర్యాన్ని నింపుతూ, విజయాల సమయంలో నిశ్శబ్దంగా ఆనందపడే వ్యక్తి తండ్రి అని ఆమె పేర్కొన్నారు. పిల్లల జీవిత ప్రయాణంలో తొలి మార్గదర్శి, తొలి ఆదర్శం, తొలి గురువు తండ్రేనని అన్నారు. తండ్రి ప్రేమను మాటల్లో పూర్తిగా వ్యక్తపరచడం సాధ్యం కాదని అనిత అభిప్రాయపడ్డారు. కుటుంబం కోసం ఆయన చేసే త్యాగాలు, బాధ్యతలు, అంకితభావం అమూల్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తండ్రి చేసిన సేవలను, త్యాగాలను గుర్తుంచుకోవాలని సూచించారు. సమాజంలో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత జీవనానికి తండ్రి చూపే మార్గదర్శకత్వం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు తండ్రి ఇచ్చే ప్రోత్సాహం ఎంతో బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని తండ్రులకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసిన అనిత, వారి అనంతమైన ప్రేమకు, త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.



# రెండేళ్ల పాలన విజయాలను ప్రజలకు వివరించిన శ్రీకృష్ణదేవరాయలు

**అమరావతి, జూన్ 21 :**

పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతిలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభతో పాటు 'ప్రజల వద్దకు ప్రవీణ్ -- 100 రోజులు, 100 గ్రామాలు' కార్యక్రమం ముగింపు సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. సభలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జిల్లా స్థాయి కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను గాడిలో పెట్టడంతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. 'ప్రజల వద్దకు ప్రవీణ్ -- 100 రోజులు, 100 గ్రామాలు' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం లభించిందని నాయకులు తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలతో మమేకమై వారి అవసరాలను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, రానున్న రోజుల్లో మరింత వేగంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### యోగ భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన

# కానుక: బండి సంజయ్

**కరీంనగర్, జూన్ 21 :**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని జ్యోతినగర్ మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, యువత, పార్టీ కార్యకర్తలతో కలిసి యోగాసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్, యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని పేర్కొన్నారు. వేల ఏళ్ల భారతీయ సంప్రదాయంలో భాగమైన యోగ నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆరోగ్యకర జీవన విధానంగా మారిందన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన చెప్పారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించడానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. రోజూ కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయిస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన, దృఢమైన భారత నిర్మాణానికి యోగ ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగ" అనే అంశంతో నిర్వహించడం ఎంతో సముచితమని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని వయసుల వారు యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు.



# జయశంకర్ కు కేటీఆర్ ఘన నివాళి

**హైదరాబాద్, జూన్ 21 :**

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడిగా జయశంకర్‌ను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన జయశంకర్ సేవలను కేటీఆర్ గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఉద్యమ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో ఆయన పోషించిన పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ అందించిన మేధోబలం, ఆలోచనా దిశ, సిద్ధాంత పరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఉద్యమకారులకు ఆయన ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన వెనుక ఉన్న ప్రముఖ వ్యక్తుల్లో జయశంకర్ ఒకరని పేర్కొంటూ, తెలంగాణ సమాజం ఆయన సేవలను ఎన్నటికీ మరువదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, స్వాభిమాన పరిరక్షణ కోసం ఆయన చూపిన మార్గం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలు, కృషి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులతో కిషన్ రెడ్డి భేటీ

**చెన్నై, జూన్ 21 :**



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి 'విశేష్ సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైలో అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులు పి. విజయ్ కుమార్ రెడ్డి, ప్రీతా రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే ప్రత్యేక పుస్తకాన్ని వారికి అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి ఈ పుస్తకంలో వివరించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. దేశ అభివృద్ధిలో వివిధ రంగాల్లో నమోదైన పురోగతిని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. దేశ ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణ, వైద్య సేవల అందుబాటు, ఆధునిక వైద్య సాంకేతికత వినియోగం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ భేటీ ఎంతో ఆహ్లాద కరంగా సాగిందని కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమాల వేదికగా పేర్కొన్నారు. పరస్పర అభిప్రాయాల మార్పిడి, వివిధ అంశాలపై ఆలోచనాత్మక చర్చలు, విలువైన సూచనలు ఈ సమావేశంలో చోటుచేసుకున్నాయని వెల్లడించారు. వైద్య రంగంలో అపోలో ఆసుపత్రుల పాత్ర, దేశ ఆరోగ్య వ్యవస్థలో ప్రైవేటు రంగం భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

# కేబీఆర్ పార్కు పరిసరాల్లో రెండో వన్‌వే ట్రయల్ రన్

**హైదరాబాద్, జూన్ 21 :**



హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో చేపట్టిన రెండో వన్‌వే ట్రాఫిక్ ట్రయల్ రన్‌ను హైదరా బాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్ శాఖ అధికారులతో కలిసి ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలను సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ శాఖ సంయుక్త పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్, ఉప పోలీసు కమిషనర్ కాజల్, జూబ్లీహిల్స్ విభాగం ఉప పోలీసు కమిషనర్ రమణారెడ్డి తదితర అధికారులతో కలిసి కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం, బసవతారకం ఆసుపత్రి పరిసరాలు, అగ్రసేన్ కూడలి, ఫిలింనగర్, రహదారి సంఖ్య 45, జూబ్లీహిల్స్ తనిఖీ కేంద్రం ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. మొదటి ట్రయల్ రన్ సందర్భంగా గుర్తించిన లోపాలను సరిదిద్దుతూ రెండో విడత ట్రయల్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వాహనాల రద్దీని తగ్గించి ట్రాఫిక్ ప్రవాహాన్ని మరింత సులభతరం చేయడమే ఈ ప్రయోగాత్మక విధానం లక్ష్యమని పేర్కొన్నారు. నగర అభి వృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాల కోసం చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని సజ్జనార్ కోరారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరిస్తే నగరంలో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

# పచ్చి గుడ్లు తింటున్నారా?.. ఆరోగ్యానికి మేలా, కీడా?

## ప్రోటీన్ కోసం పచ్చి గుడ్లపై ఆసక్తి.. కానీ జాగ్రత్తలు తప్పనిసరి

**డెస్క్, జూన్ 21 :**



గుడ్డు సంపూర్ణ పోషకాహారంగా గుర్తింపు పొందింది. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే గుడ్లను ప్రతిరోజూ ఆహారంలో చేర్చుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. అయితే ఇటీవల కొందరు ఫిట్‌నెస్ ప్రియులు, జిమ్‌కు వెళ్లే యువత పచ్చి గుడ్లను నేరుగా తినడం లేదా తాగడం అలవాటుగా మార్చుకుంటున్నారు. పచ్చి గుడ్లు తింటే ప్రోటీన్ ఎక్కువగా లభిస్తుందని చాలామంది భావిస్తారు. కానీ వాస్తవానికి ఉడికించిన గుడ్లలోని ప్రోటీన్‌ను శరీరం మరింత సమర్థవంతంగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పచ్చి గుడ్లలో ఉండే ప్రోటీన్లలో కొంత భాగం శరీరానికి పూర్తిగా అందకపోవచ్చు. మరోవైపు పచ్చి గుడ్లలో సాల్మొనెల్లా అనే హానికర బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తే కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరియు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. పచ్చి గుడ్లలో ఉండే అవిడిన్ అనే పదార్థం శరీరంలో బయోటిన్ అనే ముఖ్యమైన విటమిన్ శోషణకు ఆటంకం కలిగించవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే గుడ్లను ఉడికించినప్పుడు ఈ ప్రభావం తగ్గిపోతుంది. దీంతో గుడ్లలోని పోషకాలు శరీరానికి సులభంగా అందుతాయి. ఫిట్‌నెస్ నిపుణుల అభిప్రాయం ప్రకారం కండరాల పెరుగుదల కోసం గుడ్లు తీసుకోవాలనుకునే వారు ఉడికించిన గుడ్లు లేదా ఆమ్లెట్ రూపంలో తీసుకోవడం ఉత్తమం. దీనివల్ల ప్రోటీన్ లభించడమే కాకుండా ఆరోగ్యపరమైన ప్రమాదాలు కూడా తగ్గుతాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిలో గుడ్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వాటిని సరైన విధంగా తీసుకోవడం చాలా ముఖ్యం. కేవలం ప్రచారాలను నమ్మి పచ్చి గుడ్లను అధికంగా తీసుకోవడం కంటే వైద్యులు, పోషకాహార నిపుణుల సలహాలు పాటించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఉడికించిన గుడ్లే ఆరోగ్యానికి మరింత సురక్షితమైన ఎంపికగా భావిస్తున్నారు.

# గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కీలక సమావేశం

**హైదరాబాద్, జూన్ 21 :**




గాంధీ భవన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించింది. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యకలాపాల విస్తరణపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, శిక్షణ కార్యక్రమాల ఇంచార్జ్ రాంమోహన్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు పాల్గొన్నారు. పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. రానున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో చురుకైన పాత్ర పోషించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని సమావేశంలో సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పొరపాట్లను గుర్తించి సరిచేయించే బాధ్యతను చేపట్టాలని తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల్లో సమన్వయంతో పనిచేస్తూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

# సింగరేణి బొగ్గు చోరీ ఆరోపణలు నిరాధారం

**హైదరాబాద్, జూన్ 21 :**

సింగరేణి బొగ్గు చోరీకి గురైందని, భారీగా బొగ్గు మాయమైందంటూ కొన్ని మాధ్యమాల్లో వస్తున్న కథనాల్లో ఎలాంటి నిజం లేదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారులకు సరఫరా చేసే వరకు ప్రతి దశను అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. సింగరేణి కార్యకలాపాల విభాగం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి తుది వినియోగదారునికి చేరే వరకు ప్రతి ప్రక్రియ డిజిటల్ విధానంలో నమోదు అవుతోంది. సుమారు 85 శాతం బొగ్గు రైల్వే మార్గంలో, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం లో రవాణా అవుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు, గనులు, పరిమాణం, సరఫరా షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలన్నీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వ్యవస్థల్లో ముందుగానే నమోదు అవుతున్నాయని తెలిపారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ తూనిక కేంద్రాల వద్ద కచ్చితంగా తూకం వేస్తున్నట్లు ప్రణాళిక విభాగం అధికారులు వివరించారు. వాహనాల కదలికలను ఆర్ఎఫ్ ఐడీ ఆధారిత గేట్లు, జీపీఎస్, జీపీఆర్ఎస్ పరికరాలు, భౌగోళిక పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా నిరంతరం గమనిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశిత మార్గం నుంచి వాహనం పక్కదారి పట్టినా వెంటనే గుర్తించే సదుపాయం అందుబాటులో ఉందన్నారు. రైల్వే మార్గంలో బొగ్గు రవాణా విషయంలో కూడా ప్రతి వ్యాగన్‌కు సంబంధించిన లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్ విధానంలో నమోదు అవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. గనులు, బొగ్గు నిర్వహణ కేంద్రాలు, తూనిక కేంద్రాలు, రైల్వే సైడింగ్‌లు, నిల్వ కేంద్రాలు, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, భద్రతా సిబ్బంది నిరంతర నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు.



# నీట్ విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం..

**హైదరాబాద్, జూన్ 21 :**

రీ-నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు వినియోగించుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి విశేష స్పందన లభించిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్లిన విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. దీనివల్ల విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసే అవకాశం లభించిందన్నారు. నీట్ పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అన్నారు. విద్య, ఉపాధి, పోటీ పరీక్షల విషయంలో విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఫిఫా ప్రపంచకప్ 2026లో చరిత్రాత్మక రికార్డులు



**మాంటెరే, జూన్ 21 :**
ఫిఫా ప్రపంచకప్ 2026 ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. గత 68 ఏళ్ల ప్రపంచకప్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత వేగంగా 100 గోల్స్ నమోదు అయిన ఎడిషన్‌గా ఈ టోర్నీ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం 33 మ్యాచ్‌లు ముగిసే సమయానికే ఆటగాళ్లు ఈ మైలురాయిని అందుకోవడం విశేషంగా మారింది. స్వీడన్‌తో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ స్టార్ ఆటగాడు కోడి గాక్‌పో మూడో గోల్ సాధించడంతో అది ఈ టోర్నమెంట్‌లోని 100వ గోల్‌గా నమోదైంది. దీంతో ఈ ప్రపంచకప్ అత్యంత వేగంగా వంద గోల్స్ పూర్తి చేసిన టోర్నీగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ గోల్‌తో నెదర్లాండ్స్ ఫుట్‌బాల్ చరిత్రలో వంద గోల్స్ పూర్తి చేసిన ప్రత్యేక క్లబ్‌లో చోటు దక్కించుకున్న ఎనిమిదో దేశంగా నిలిచింది. టోర్నీ మొత్తం మీద జట్ల దూకుడు ఆట, దాడి శైలి ఈ రికార్డుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇక ఇదే ప్రపంచకప్‌లో మరో చారిత్రాత్మకఘట్టం కూడా నమోదైంది. మాంటెరే స్టేడియంలో జపాన్, ట్యునీషియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో 1,000వ మ్యాచ్‌గా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ మ్యాచ్ మైలురాయి పరంగా మాత్రమే కాకుండా అభిమానుల ఆసక్తి పరంగా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకే టోర్నమెంట్‌లో అత్యంత వేగంగా 100 గోల్స్ నమోదు కావడం, అలాగే 1,000వ మ్యాచ్ పూర్తి కావడం వంటి రెండు అరుదైన ఘట్టాలు ఒకేసారి చోటు చేసుకోవడం ఫుట్‌బాల్ ప్రపంచంలో చరిత్రాత్మక సందర్భంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# చరిత్ర సృష్టించిన జపాన్..




**న్యూఢిల్లీ, జూన్ 21 :**
ఫిఫా వరల్డ్ కప్ 2026లో చరిత్రాత్మక 1000వ మ్యాచ్ జపాన్ జట్టు ఘన విజయం సాధించింది. గ్రూప్-ఎఫ్‌లో భాగంగా మెక్సికోలోని మాంటెర్రే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ట్యునీషియాపై జపాన్ 4-0 తేడాతో పూర్తి ఆధిపత్యం చూపించింది.

ఫిఫా వరల్డ్ కప్ 2026 చరిత్రలో 1000వ మ్యాచ్‌గా నిలిచిన ఈ కీలక పోరులో జపాన్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. మ్యాచ్ ప్రారంభమైన నాలుగో నిమిషంలోనే దాచి కమాడా క్లోజ్ రేంజ్ షాట్‌తో గోల్ సాధించి జపాన్‌కు శుభారంభం ఇచ్చాడు. ఇది టోర్నమెంట్‌లో జపాన్ తరఫున నమోదైన అత్యంత వేగవంతమైన గోల్‌గా నిలిచింది. 31వ నిమిషంలో అయాసే ఉ యెడ ట్యునీషియా రక్షణను ఛేదిస్తూ లో షాట్‌తో రెండో గోల్ నమోదు చేశాడు. మొదటి అర్ధభాగంలోనే జపాన్ పూర్తి ఆధిపత్యం నెలకొల్పింది. రెండో అర్ధభాగంలో 69వ నిమిషంలో జున్యా ఇతో గోల్ చేయడంతో స్కోరు 3-0కు చేరింది. 83వ నిమిషంలో ఉయెడ మరోసారి హెడర్‌తో గోల్ చేసి తన రెండో గోల్‌ను నమోదు చేశాడు. దీంతో మ్యాచ్ జపాన్ వైపుకు పూర్తిగా మళ్లింది. అతడి రెండు గోల్స్ జపాన్ విజయానికి కీలకంగా మారాయి. ఈ విజయంతో జపాన్ గ్రూప్-ఎఫ్‌లో 4 పాయింట్లతో నెదర్లాండ్స్‌తో కలిసి అగ్రస్థానంలో నిలిచింది. వరుసగా రెండో ఓటమితో ట్యునీషియా టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించింది. మొత్తం మ్యాచ్‌లో జపాన్ దూకుడు, వేగం, ఫినిషింగ్ నైపుణ్యం స్పష్టంగా కనిపించగా, ఈ భారీ విజయంతో రౌండ్ ఆఫ్ 32 అవకాశాలను మరింత బలపరుచుకుంది.

# కివీస్ పంజా.. ఇంగ్లండ్‌కు ఘోర ఓటమి



**లండ, జూన్ 21, :**
సొంతగడ్డపై ఇంగ్లండ్‌కు ఘోర పరాభవం ఎదురైంది. కెన్నింగ్‌టన్ ఓవల్ వేదికగా జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 253 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అద్భుతంగా రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చాడు. ఈ ప్రదర్శనతో ఓవల్ మైదానంలో ఒక టెస్టులో పది వికెట్లు తీసిన బౌలర్‌గా, దివంగత షేన్ వార్న్ తర్వాత అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో గ్లెన్ ఫిలిప్స్ సెంచరీతో న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించింది. అనంతరం మ్యాట్ హెన్రీ ధాటికి ఇంగ్లండ్ 291 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో హెన్రీ నికోల్స్ 121 పరుగులతో సెంచరీ సాధించడంతో కివీస్ 362 పరుగులు చేసి ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారీ ఛేదనలో ఇంగ్లండ్ తరఫున జో రూట్ 77 పరుగులు, హ్యారీ బ్రూక్ 58 పరుగులతో పోరాడినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. మ్యాట్ హెన్రీ మరోసారి చెలరేగడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కుప్పకూలి 253 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలవడంతో సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. నిర్ణయాత్మక మూడో టెస్టు జూన్ 25 నుంచి నాటింగ్‌హామ్‌లో జరగనుంది.

# ఇంగ్లండ్ పర్యటనకు భారత వన్డే జట్టు ప్రకటన



**న్యూఢిల్లీ, జూన్ 21 :**
2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని భారత క్రికెట్ సెలెక్టర్లు అనుభవం మరియు యువ ప్రతిభ కలయికతో ఇంగ్లండ్ పర్యటన కోసం వన్డే జట్టును ప్రకటించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ప్రకటించిన ఈ 15 మంది జట్టులో సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు మరోసారి అవకాశం లభించింది. అఫ్గనిస్థాన్‌పై చెపాక్‌లో శతకం సాధించిన యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌ను మాత్రం ఈసారి జట్టులో నుంచి తప్పించడం గమనార్హంగా మారింది. ఈ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జట్టు నాయకత్వ బాధ్యతలను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించగా, శ్రేయాస్ అయ్యర్‌ను ఉపనాయకుడిగా నియమించారు. వికెట్ కీపర్లుగా కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్‌లకు అవకాశం ఇచ్చారు. ఆల్‌రౌండర్ల విభాగంలో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ రెడ్డి, హర్షిత్ రానా ఎంపికయ్యారు. పేస్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణతో పాటు యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు చోటు దక్కింది. జూలై 14 నుంచి ఇంగ్లండ్‌లో ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్ ఈ జట్టుకు 2027 ప్రపంచకప్ దిశగా కీలక పరీక్షగా నిలవనుంది.




# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం -- భారత్ ‘ఏ’ భారీ స్కోరు 377/9



**దంబుల్లా, జూన్ 21 :**
శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు ‘ఏ’ సిరీస్ ఫైనల్‌లో భారత్ ‘ఏ’ జట్టు బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించింది. శ్రీలంక ‘ఏ’తో జరిగిన ఈ కీలక మ్యాచ్‌లో భారత యువ ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శనతో 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు నమోదు చేశారు. మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. అతను కేవలం 29 బంతుల్లో 94 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 8 సిక్సర్లు ఉండగా, అతను కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి బౌలర్లపై ఆధిపత్యం చూపించాడు. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యతో కలిసి సూర్యవంశీ భారత్‌కు వేగవంతమైన ఆరంభం అందించాడు. 8.5 ఓవర్లకే స్కోరు 132 పరుగులు చేరడం ద్వారా జట్టు దూకుడు స్పష్టమైంది. శతకం దిశగా సాగుతున్న సూర్యవంశీ 94 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఆ తర్వాత కెప్టెన్ తిలక్ వర్మ (67) మరియు రుతురాజ్ గైక్వాడ్ (40) ఇన్నింగ్స్‌ను స్థిరపరిచారు. మూడో వికెట్‌కు వీరిద్దరూ 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం కుమార్ కుశాగ్ర 36 పరుగులతో వేగంగా ఆడాడు. చివర్లో అనుకూల్ రాయ్ కేవలం 15 బంతుల్లో 39 పరుగులు చేసి స్కోరును 370 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. అతని ఇన్నింగ్స్‌లో 1 ఫోర్, 4 సిక్సర్లు ఉన్నాయి. శ్రీలంక ‘ఏ’ బౌలర్లలో రవిందు ఫెర్నాండో, వనుజ సహన్ చెరో రెండు వికెట్లు తీశారు. అయితే మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతో భారత్ భారీ స్కోరు సాధించగలిగింది.



# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం: 11 బంతుల్లో హాఫ్ సెంచరీతో ప్రపంచ రికార్డు

**దంబుల్లా, జూన్ 21 :**
భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక--ఎ జట్టుపై అద్భుతమైన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దంబుల్లా వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. లిస్ట్--ఎ క్రికెట్ చరిత్రలో ఇది అత్యంత వేగమైన అర్ధశతకంగా నిలిచింది. వైభవ్ ఇన్నింగ్స్‌లో వరుసగా వచ్చిన బౌండరీలు మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపుకు తిప్పేశాయి. 4, 4, 4, 6, 6, 6 వంటి షాట్లతో శ్రీలంక బౌలర్లపై అతను ఎదురులేని దాడి చేశాడు. అతని దూకుడు బ్యాటింగ్‌తో స్టేడియం మొత్తం ఉత్సాహంతో మార్మోగింది. ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్‌లో మరోసారి తన ప్రత్యేక గుర్తింపును నమోదు చేసుకున్నాడు.



# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తర్వాత భారత్--ఏ పటిష్ట స్థితి

**దంబుల్లా, జూన్ 21 :**
ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్‌లో భాగంగా దంబుల్లా వేదికగా శ్రీలంక--ఏతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్--ఏ భారీ స్కోర్ దిశగా దూసుకుపోతోంది. 27 ఓవర్ల ముగిసే సమయానికి భారత్--ఏ 215 పరుగులు చేసింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ అవుట్ అయినప్పటికీ జట్టు మంచి స్థితిలో కొనసాగుతోంది. ప్రస్తుతం క్రీజులో తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను నిలకడగా ముందుకు నడిపిస్తున్నారు. మ్యాచ్ ప్రారంభంలోనే వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాడు. కేవలం 11 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసి లిస్ట్--ఎ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన అర్ధశతకంగా ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. వైభవ్ ఇన్నింగ్స్‌లో వరుసగా 4, 4, 4, 6, 6, 6 వంటి బౌండరీలతో శ్రీలంక బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చాడు.




# శ్రీలంక-ఏపై భారత్-ఏ ఘన విజయం

**చెన్నై, జూన్ 21, .:**
ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ జట్టు మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఫైనల్లో శ్రీలంక-ఏపై 66 పరుగుల తేడాతో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు నిర్ణీత ఓవర్లలో 378 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం 379 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక-ఏ జట్టు 311 పరుగులకే ఆలౌటైంది. శ్రీలంక తరఫున వనుజ సాహన్ 62 పరుగులు, సదీర సమరవిక్రమ 52 పరుగులు చేసి పోరాడినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. భారత్-ఏ బౌలర్లలో యష్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో మూడు వికెట్లు పడగొట్టగా, అనుకుల్ రాయ్ రెండు వికెట్లు తీశాడు. ఆకిబ్ ఖాన్, తిలక్ వర్మ చెరో వికెట్ సాధించి శ్రీలంక ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు.

# ధనుష్-మృణాల్‌పై కొత్త ప్రచారం

హైదరాబాద్, జూన్ 21 :

కోలీవుడ్ నటుడు ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పలుమార్లు ఇద్దరూ కలిసి కనిపించడం, ఒకరి కుటుంబ సభ్యులతో మరొకరు సన్నిహితంగా మెలగడం వంటి అంశాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. అయితే తాజాగా ఈ ఇద్దరూ దూరమయ్యారంటూ సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. దీంతో ధనుష్, మృణాల్ సంబంధంపై మరోసారి ఆసక్తికరమైన ప్రచారం తెరపైకి వచ్చింది. గత ఏడాది ఆగస్టులో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్ ప్రదర్శనలో ధనుష్, మృణాల్ కలిసి కనిపించడం అభిమానుల్లో చర్చకు దారి తీసింది. ఆ తరువాత ధనుష్ నటించిన 'తేరే ఇష్క్ మే' చిత్రానికి సంబంధించిన వేడుకలో కూడా మృణాల్ పాల్గొనడం వీరిద్దరి మధ్య ప్రత్యేక అనుబంధం ఉందనే ప్రచారానికి కారణమైంది. అంతేకాకుండా మృణాల్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ధనుష్ సోదరీమణులు కార్తీక, విమలా గీతలను అనుసరిస్తుండటమూ ఈ వార్తలకు మరింత ఊతమిచ్చింది. దీంతో ఇద్దరూ ప్రేమలో ఉన్నారనీ, త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనీ కథనాలు వినిపించాయి. ఈ ప్రచారంపై ధనుష్ ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. అయితే మృణాల్ మాత్రం గతంలో ధనుష్ తనకు మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ వ్యాఖ్యలతోనూ పుకార్లకు పూర్తిగా తెరపడలేదు. ఇదిలా ఉండగా, వీరిద్దరికీ సన్నిహితంగా ఉన్న కొందరు వ్యక్తులు మాత్రం ధనుష్, మృణాల్ నిజంగానే ఒకరినొకరు ఇష్టపడుతున్నారని, అయితే ఆ సంబంధం ప్రారంభ దశలోనే ఉందని చెప్పినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇద్దరికీ ఒకే విధమైన ఆలోచనలు, విలువలు ఉండటంతో బాగా కలిసిపోయారని, కానీ వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచాలని భావిస్తున్నారని కూడా ప్రచారం జరిగింది. ఇప్పుడు తాజాగా కొన్ని సినీ వర్గాల కథనాల ప్రకారం ధనుష్, మృణాల్ మధ్య దూరం పెరిగిందని, ఇద్దరూ విడిపోయారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వీరి మధ్య విభేదాలకు గల అసలు కారణాలేమిటన్నది ఇప్పటివరకు బయటకు రాలేదు. మరోవైపు ఈ ప్రచారంపై ఇప్పటి వరకు అటు ధనుష్ గానీ, ఇటు మృణాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ధనుష్ గతంలో సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నారు.





# 'బాహుబలి' డాక్యుసిరీస్‌కు విడుదల తేదీ

హైదరాబాద్, జూన్ 21 :

ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన 'బాహుబలి' ఫ్రాంచైజీకి సంబంధించి మరో ఆసక్తికర అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. 'బాహుబలి: ది టార్చ్ బేరర్' పేరుతో రూపొందిన డాక్యుసిరీస్ ఈ నెల 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'బాహుబలి' రెండు భాగాల విజయంతో తెలుగు సినిమా అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నేపథ్యంలో, ఇప్పుడు ఆ మహా ప్రయాణం వెనుక కథలను ఈ డాక్యుసిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇది సాధారణ సినిమా కాకుండా, 'బాహుబలి' రూపుదిద్దుకున్న తీరు, ఆ ఫ్రాంచైజీ వెనుక ఉన్న కఠిన శ్రమ, సృజనాత్మక దృష్టి, సాంకేతిక విస్తృతి, ప్రపంచవ్యాప్తంగా దక్కిన స్పందన వంటి అంశాలను ప్రతిబింబించే డాక్యుసిరీస్‌గా రూపొందినట్లు సమాచారం. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆలోచన ఎలా ఆవిర్భవించింది, ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ వంటి తారలు తమ పాత్రల కోసం ఎలా సిద్ధమయ్యారు, వేలాది మంది సాంకేతిక నిపుణులు ఈ మహా ప్రాజెక్ట్ కోసం ఎంతటి కృషి చేశారు వంటి విశేషాలను ఇందులో చూపించనున్నారు.





# జ్యోతికకు 27 ఏళ్లలో హిందీ ఆఫర్ లేదు

హైదరాబాద్, జూన్ 21 :

దక్షిణాది సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి జ్యోతిక తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా తమిళ, తెలుగు చిత్రసీమల్లో విజయవంతమైన నటిగా కొనసాగిన ఆమెకు 27 ఏళ్ల సినీ ప్రయాణంలో ఒక్క హిందీ సినిమా అవకాశం కూడా రాలేదని వెల్లడించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకప్పుడు బాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమైనప్పటికీ, ఆ తర్వాత అక్కడి నుంచి ఎలాంటి అవకాశాలు రాకపోవడం గురించి జ్యోతిక చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విస్తృతంగా చర్చకు దారి తీశాయి. 1998లో విడుదలైన 'దోలి సజా కె రఖ్నా' చిత్రంతో జ్యోతిక హిందీ చిత్రసీమలో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోవడంతో ఆమె దక్షిణాది చిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేశారు. అనంతరం తమిళ సినీ పరిశ్రమలో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన జ్యోతిక, తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితమైన నటిగా మారారు. అనేక సూపర్‌హిట్, బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగ పాత్రలు, వాణిజ్య చిత్రాలు ఇలా విభిన్నమైన కథాంశాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఇలాంటి విజయవంతమైన కెరీర్ ఉన్నప్పటికీ బాలీవుడ్ నుంచి అవకాశాలు రాకపోవడంపై జ్యోతిక తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.





# నందిని రెడ్డి మాటలు మళ్లీ వైరల్

హైదరాబాద్, జూన్ 21 :

తెలుగు సినీ పరిశ్రమలో కుటుంబ కథా చిత్రాలను హృద్యంగా ఆవిష్కరించే దర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నందిని రెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. 'అలా మొదలైంది'తో దర్శకురాలిగా విజయవంతమైన ఆరంభం చేసిన ఆమె, ఆ తర్వాత 'కల్యాణ వైభోగమే', 'ఓ బేబీ' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. తాజాగా సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చిన నందిని, ప్రస్తుతం మంచి చర్చలో నిలిచారు. ఇదే సమయంలో ఆమె గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో వ్యక్తిగత జీవితం, అభిరుచులు, పెళ్లి గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నందిని రెడ్డి సినీ ప్రయాణం మొదటి చిత్రంతోనే ప్రత్యేకంగా నిలిచింది. 'అలా మొదలైంది' ద్వారా సహజమైన ప్రేమకథను, భావోద్వేగాలను తెరపై ఆహ్లాదకరంగా ఆవిష్కరించిన ఆమె, తొలి ప్రయత్నంతోనే దర్శకురాలిగా మంచి గుర్తింపు పొందారు. అనంతరం 'జబర్దస్త్', 'కల్యాణ వైభోగమే', 'ఓ బేబీ' వంటి చిత్రాలతో కుటుంబ కథలు, హాస్యం, భావోద్వేగాలను మేళవించే దర్శకురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు 'మా ఇంటి బంగారం' చిత్రంతో మరోసారి తన కథనం, భావోద్వేగాల మేళవింపుతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. జూన్ 19న విడుదలైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఈ చిత్రం గూఢచారి కథ కాదు, కుటుంబ భావోద్వేగాలతో కూడిన కథ అని నందిని రెడ్డి ప్రమోషన్ సమయంలో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, గతంలో ఒక ఇంటర్వ్యూలో నందిని రెడ్డి తన వ్యక్తిగత అభిరుచుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. చిన్నప్పటి నుంచి తనకు ఉంగరాల జుట్టు ఉండేదని, జడ వేయించుకునే సమయంలో చాలా నొప్పిగా అనిపించేదని, అందుకే అవకాశం దొరికినప్పుడల్లా జుట్టు కత్తిరించుకునేదాన్నని ఆమె చెప్పారు. ఆ అలవాటు ఇప్పటికీ అలాగే కొనసాగుతోందని పేర్కొన్నారు.

# 'బిగ్‌బాస్ తెలుగు 10'పై భారీ ఆసక్తి

హైదరాబాద్, జూన్ 21 :

తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు ల్యాండ్‌మార్క్ సీజన్‌గా పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మేకర్స్ వరుస ప్రోమోలు, అప్‌డేట్స్‌తో ఆసక్తిని పెంచుతుండగా, కంటెస్టెంట్ల ఎంపికపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ కొనసాగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ సీజన్ ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులకు అవకాశం కల్పించే విధంగా 'అగ్నిపరీక్ష 2' ద్వారా కంటెస్టెంట్లను ఎంపిక చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పదో సీజన్ కావడంతో హౌస్‌లో కొత్త కాన్సెప్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు, విభిన్నమైన టాస్కులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఈ సీజన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు టెలివిజన్ నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లు కంటెస్టెంట్ల జాబితాలో వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ కుటుంబ సభ్యులు, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణి, ప్రభాకర్ లేదా చంద్రహాస్ వంటి పేర్లు సోషల్ మీడియాలో చర్చకు దారి తీస్తున్నాయి. ఇక తాజాగా ఈ జాబితాలో జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర పేరు కూడా బలంగా వినిపిస్తోంది. 'జబర్దస్త్', 'శ్రీదేవి డ్రామా కంపెనీ' వంటి కామెడీ షోల ద్వారా గుర్తింపు పొందిన పవిత్ర, తన సహజమైన హాస్యం, ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఒకప్పుడు బ్యూటీ పార్లర్‌లో పనిచేసిన ఆమె, తన ప్రతిభతో బుల్లితెరపై ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గతంలోనూ ఆమె పేరు బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా వినిపించినప్పటికీ, ఈసారి మాత్రం హౌస్‌లోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బిగ్‌బాస్ టీమ్ ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పవిత్ర నిజంగానే హౌస్‌లోకి అడుగుపెడితే షోకు వినోదం మరింత పెరుగుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో 'బిగ్‌బాస్ తెలుగు 10'పై ఉత్కంఠ రోజురోజుకీ పెరుగుతోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467